# సంతృప్తి

రెండు మూడుసార్లు గట్టిగా తలుపును చప్పుడుచేసి, భార్యను పేరు బెట్టి పిలిచిన తరువాత, కిటికీ తెరిచి, వచ్చిన వ్యక్తి తన భర్తేనని రూఢి జరిగిన పిమ్మట పార్వతి తలుపు తీసింది.

పార్వతి ముఖం చూసిన వాళ్ళెవరైనా "ఇదిగా" ఉండే సంఘటన యేదో జరిగిందని నిస్సంకోచంగా చెబుతారు.

"ఏమిటోయ్?" అన్నాడు జగన్నాథం, డ్రాయరుమీది దీపాన్ని కొంచంగా పెద్దది చేసి, భార్యను ఆపాదమస్తకం పరిశీలిస్తూ.

"నిద్రపొయ్యేవాళ్ళను ఎవరైనా లేపుతారు, మేలుకుని ఉన్నవాళ్ళను లేపనవసరం లేదనుకోండి. కానీ మేలుకుని ఉండిగూడా, నిద్రపోతున్నట్లు నటించేవాళ్ళను లేపటం బ్రహ్మతరం కాదు" అన్నది పార్వతి.

"అసలు విషయమేమిటో చెప్పకుండా, నువ్వెంత అరిచినా లాభముండదు. నీ అరుపులను ఆధారం చేసుకుని విషయాన్ని గ్రహించగల బుద్ధి సూక్ష్మత నాకు లేదు" అన్నాడు జగన్నాథం కొంచం కోపంగానే!

"మీకు సూక్ష్మబుద్ధి ఉన్నదో లేదో నాకనవసరం. రెండు మూడు రోజుల్లో ఇంకో యింటిని చూస్తే చూడండి. లేదా నన్ను మా పుట్టింటికి పంపించెయ్యండి. మిగతా సంగతులనవసరం."

"ఏం? ఈ యింటికేం తీపరమొచ్చిందీ? తొమ్మిది రూపాయల అద్దెలో ఇంతకంటే మంచి కొంప ఈ తెనాలిలో దొరకటం అసంభవం. ఈ సంగతి నీకు తెలియదల్లే ఉంది."

"ఈ యింటికొచ్చిన 'తీపర" మేమిటంటారా? ప్రొద్దు పొడుపున ఆఫీస్‌కెళ్ళి సాయంత్రానికొచ్చే మీకేం తెలుస్తుంది ఆ బాధ? చెప్పుకుంటే సిగ్గు పోతుంది. చెప్పుకోకపోతే మానం బోతుంది" అన్నది పార్వతి కూచుంటూ. "తొమ్మిది కాకపోతే పది. పది కాకపోతే పదకొండు."

"పదకొండు కాకపోతే ఇరవైరెండు. నీకేం? తిని కూచుని ఎన్నైనా చెబుతావు. మోసేవాడికి తెలుస్తుంది భారం."

"అట్లాగని లుచ్ఛావాళ్ళ పొరుగులో ఉంటామటండీ ఎక్కడైనా? ఇరుగు మంచి పొరుగు మంచి అన్నారా? ఈ రెండూ అధ్వాన్నంగా ఉన్నప్పుడు ఏం, అట్లాంటి చోట ఉండకపోతే?"

"ఒకళ్ళతో నీ కనవసరం. వాళ్ళ లుచ్ఛాతనం వాళ్ళకే ఉండనీ. అది నిన్ను పూసుకోమని ఎవరు చెప్పారు? వాళ్ళు చెడ్డవాళ్ళని నీకు తోచినప్పుడు దూరంగా ఉండటమే సాక్ష్యం..."

"మనం దూరంగానే ఉంటాం. వాళ్ళే దగ్గిర కొస్తున్నారు. ఎంత కాలమని, ఎంత దూరమని జరిగేట్టు? అప్పటికీ రెండు నెలలుబట్టీ సహిస్తూ వచ్చాను. మరీ ఇవ్వాళ మధ్యాన్నంతో నా ఓపిక జారిపోయింది.

"నిన్న నవ్వటాలు, ఇవ్వాళ పాటలు, రేపు ఆటలు, ఎల్లుండి మిగతాది..." చెప్పలేక పాపం! పార్వతి ఆగిపోయింది.

జగన్నాథం క్షణంసేపు నిర్విణ్ణుడయ్యాడు.

"ఎవరు?"

"ఎవరో దూరంగా అయితే నాకేం పోయింది. అదేం ఆ వెధవ! సుబ్బారావు పక్షి" అన్నది పార్వతి ఆ మాటలు అనటంలో ఎంతో అసహ్యాన్ని కనబరుస్తూ.

"ఏం? అతనేం చేశాడు?"

"ఇంకేం చెయ్యాలండి నా బొంద? అస్తమానమూ ఆ వాకిట్లో కూచుని మన ఇంటివేపు చూస్తుంటాడు. ఈల పాటలు పాడుతుంటాడు. తన సొరకాయ ముఖం చూసి ఎవరు మెచ్చుకోవాలనో ఆ పోకిళ్లు? ఇవ్వాళ్ల మట్టుకు ఇవ్వాళ నలుగురు వెధవలను పోగుచేసి మన యింటివేపు తలుపు బార్లాగాతీసి మాట్లాడుతున్నాడు. ఇంతకంటే మానంగల యిల్లాలిని ఇంకేం చెయ్యాలి? మీ దృష్టిలో ఇవి తప్పులు కావు కాబోలు."

"దీని నటోయ్! ఇంత గొడవ పడటం? అతనింటో అతను తొంభై అరుచుకుంటాడు, మనదేం పోయిందీ?"

"మనదేం పోయిందీ అనకండి. నాదేం పోయింది! అనండి. మీకేమీ పోయినట్టు అనిపించక పోవచ్చు. నాకు మాత్రం ప్రాణాలు పోతున్నట్టుగా ఉంది" అన్నది పార్వతి.

"అంత బాధపడటం అనవసరం పార్వతీ! అతను నువ్వనుకున్నంత దుర్మార్గుడు కాదు. కొందరి కొందరి చేష్టలకంటే అతను చేస్తున్నది చాలా నయం."

"మీరు కూడా ఆ దౌర్భాగ్యుడికి "ఒత్తాసు" పలుకుతున్నారా? రేపట్నుంచీ వాడు మరీ పెచ్చరిల్లిపోతాడు...మీరెన్నన్నా చెప్పండి. యిటువంటి చాడీచేష్టలు నేను సహించలేను. అద్దె చెల్లించటం మీకు బరువైతే—పోనీ, నే నొక పూట తిండి మానుకుంటాను. ఇంకో యిల్లు మాట్లాడండి."

"అది నువ్వనుకుంటున్నంత సులభం కాదు."

"కాకపోతే ఆ సుబ్బాయ్‌గాణ్ణి—ఆ యింటోంచి వెళ్లగొట్టించండి. ఈ రెంటిలో ఏది చెయ్యటానికీ మీకు సమర్థత లేకపోతే, ఆ సమర్థత వచ్చేటంత వరకూ మా నాన్న దగ్గిరకి పంపించండి. అంతేగాని ఈ వెధవ పొరుగున నేను ఘడియ సేపుండను" అన్నది పార్వతి విసురుగా వంటింట్లోకి పోతూ.

జగన్నాథానికి నవ్వొచ్చింది. పార్వతి ఇక నాలుగేళ్ళు బస్తీలో ఉన్నప్పటికీ ఈ "బెదురు" పోదనిపించింది అతనికి. వొట్టి అమాయకురాలు. పిచ్చిపిల్ల. పర పురుషుడి "చూపు"నైనా భరించలేదు. ఆ మాత్రం నీతి భారత స్త్రీలల్లో ఉండబట్టే—ఈ భూమి సముద్రంలో మునగకుండా, యింకా తేలుతున్నది. సకాలానికి వర్షాలు కురిసి నాలుగు గింజలు పండుతున్నయ్. లేకపోతే ఎప్పుడో మహా ప్రళయం సంభవించి ఉండేదని జగన్నాథానికి అనిపించి—భోజనానికి లేచాడు.

* * *

అర్థరాత్రి దాటింది. దీపం చాలా చిన్నదిగా తగ్గించి సుబ్బారావు పడుకున్నాడు. ఎంత ప్రయత్నించినా నిద్ర రావటల్లేదు. దగ్గిరగా వేసివున్న తలుపును గాలి నెమ్మదిగా తడుతోంది. దూరంగా ఎక్కడో ఒక కుక్క. అరుపు సన్నగా వినపడుతోంది.

...మెడ చుట్టూ చల్లగా పాకి, తనను లేవదియ్యటానికి ప్రయత్ని స్తున్న రెండు చేతుల్ని సుబ్బారావు దూరంగా విసిరి పారేశాడు.

"ఎందుకు అంత కోపం నా మీద? పెందరాడే రావాలని నే నెంత ప్రయత్నించానో, ఇక్కడున్న నీ కేం తెలుసు? ఇప్పటి దాకా ఆ మొద్దు నన్ను వదల్లేదు."

"నీ మీద కోపంలేదు పార్వతీ! నువ్వేటువంటి ప్రయత్నం చేశావో నాకు తెలియనక్కర్లేదు. వెళ్లు, తిరిగి పో. ఆ "మొద్దు" నిన్ను వెంటనే వదిలినందుకు విచారిస్తున్నాను" అన్నాడు సుబ్బారావు, తన నడుము చుట్టూ చేతులు వలయం చుడుతున్న పార్వతిని దూరంగా త్రోసి.

"రోజూ లేనిది, ఇవ్వాళ ఎందుకు నామీద కోపం? నేనేం తప్పు చేశాను?" అన్నది పార్వతి చీకట్లో అతన్ని ముఖాని వెదుకుతూ.

"దూరంగా ఉండు...నువ్వేం తప్పు చెయ్యలేదు. ఇటువంటిదాన్ని దగ్గిర చేరనిచ్చిన నేరానికి నాదే తప్పు. చెంపలు వేసుకుంటున్నాను వెళ్లు."

ఏముటో చెప్పండి" అన్నది పార్వతి దిగులుగా.

"పిల్లి పాలు త్రాగుతూ, ఎవ్వరూ చూడటల్లేదను కుంటుంది. ఒక నాడు కాకపోతే, ఇంకొకనాడు, నిజం బైట పడుతుంది పార్వతీ! నేను రాడీని, దౌర్భాగ్యుణ్ని, లుచ్ఛాని, బహుశా ఈ సంగతి నువ్వీరోజు నే తెలుసుకుని ఉంటావు. తెలియనప్పుడు అనేకం జరిగినై. వాటిని పోనివ్వు, తెలుసుకున్న తర్వాత కూడా ఎందుకు?"

"నా మాటవిని..." అంటున్నది పార్వతి.

"అక్కర్లేదు. నీ మాట ఇందాక వినే ఈ మాట యిప్పుడు అంటు న్నాను. నేను నిన్ను రమ్మని కోరలేదు. నీ అంతట నీవే వచ్చావు. నా "చూపు"లే దుర్భరంగా ఉన్నప్పుడు, రెండు నెలలబట్టీ నన్నెట్లా భరిస్తు న్నావో, ఎందుకు భరిస్తున్నావో అర్థం కావటల్లేదు—అదృష్టవశాత్తూ ఎందుకో యివాళ షికారు పోబుద్ధిగాక యింట్లోనే ఉండిపోబట్టి, నే నంటే నీ దృష్టిలో ఎంత గౌరవం ఉందో తెలుసుకో గలిగాను. ధన్యుణ్ణి" అన్నాడు సుబ్బారావు.

"ఇదా! ఇదేనా నీ కోపానికి కారణం?"

"ఇది నీకు సకారణంగా లేకపోవచ్చు. కానీ..." అంటున్నాడు సుబ్బారావు. పార్వతి అతని నోటిని తన పెదిమలతో మూసింది.

"ఉండు—విను. నువ్వింత ఆలోచనలేని మనిషివనుకోలేదు సుమండీ! మనం చేస్తున్న పని ఏ నాడయినా, ఆయన అనుమానానికి గురి కావచ్చు. మనిద్దర్నీ కలుసుకోకుండా, తగు జాగ్రత్తలు కూడా తీసుకోవచ్చు. అంత వరకూ రాకముందే, నువ్వంటేనే పరమ అసహ్యాన్ని కనబరిచే నేను, ఆయనను మంచి నమ్మకస్తురాలిని. ఇక ఎవరు అనుకోవటానికి మాత్రం ఏం వీలుంటుంది? అందుకని..."

మిగతా మాటలు పార్వతి పెదాలు ఉచ్చరించకుండా, సుబ్బారావు తన పెదిమలు అడ్డుపెట్టి, ఆమెమీదికి వొరిగాడు.